ప్రమాదాల నియంత్రణకు చర్యలు

ప్రజాశక్తి -అనంతగిరి: ప్రర్యాటక ప్రాంతాలలో ప్రమాదాల నివారణకు అరకు ప్రధాన రహదారిలో బారికేడ్లు ఏర్పాటు చేయడం జరిగిందని అరకు సీఐ ఎల్.హిమగిరి అన్నారు. బుధవారం చిలకలగెడ్డ ఫారెస్ట్ చెక్ పోస్ట్ మలుపు వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రెండు రోజులు క్రితం ఈ మలుపు వద్ద బైక్, స్కూటీ ఢీకొని మృతి చెందిన విషయాన్ని గుర్తు చేశారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై .శ్రీనివాస్, మండల కో ఆప్షన్ సభ్యులు షేక్. మదీనా పాల్గొన్నారు.

బారికేడ్ ఏర్పాటు చేస్తున్న సిఐ

పోరాటంతోనే సమస్యల పరిష్కారం

-ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయ గౌరి -12వ రోజు కొనసాగిన గురుకుల అవుట్‌సోర్సింగ్ టీచర్ల రిలే దీక్షలు

ప్రజాశక్తి -పాడేరు: ఐక్యతతో ఉద్యమాన్ని సాగించి ఉద్యోగ భద్రతను సాధించాలని పిడిఎఫ్ బలపరిచిన ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి కె విజయ గౌరీ పిలుపునిచ్చారు. స్థానిక ఐటిడిఏ ఎదుట గురుకుల ఔట్సోర్సింగ్ టీచర్లు నిర్వహిస్తున్న రిలే దీక్షలు బుధవారం 12వ రోజు కొనసాగాయి. ఈ దీక్షా శిబిరాన్ని విజయ గౌరీ సందర్శించి ఆందోళనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 12 రోజులుగా రిలే దీక్షలు నిర్వహిస్తున్న ఔట్సోర్సింగ్ టీచర్ల ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు. గత 15 ఏళ్లుగా విద్యా రంగంలో అన్ని శాంక్షన్ పోస్టుల్లో సీఆర్టీలు, అవుట్సోర్సింగ్ ఉపాధ్యాయుల పని చేస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం వీరిని శ్రమ దోపిడీకి గురి చేస్తోందని ఆమె తీవ్రంగా ధ్వజమెత్తారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని ప్రభుత్వాలను డిమాండ్ చేస్తున్నా స్పందించ లేదన్నారు రాజ్యాంగం కల్పించిన హక్కులనే అమలు పరచలేని దుస్థితిలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయని ఆమె విమర్శించారు. ఉద్యోగాలు సాగించే వరకు పోరాటం కొనసాగించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి వి మహేశ్వరరావు, వివిధ మండలాల గురుకుల ఔట్సోర్సింగ్ టీచర్లు పాల్గొన్నారు....

మాట్లాడుతున్న ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి విజయగౌరీ

విద్యా బోధనపై ఆరా తీస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

రహదారులు, విద్య, వైద్యం అభివృద్ధికి చర్యలు

- అల్లూరి జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-మారేడుమిల్లి

ఏజెన్సీలోని మారుమూల గ్రామాలకు రహదారులు, విద్య, వైద్యం అభివృద్ధి చేసే విధంగా తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ పేర్కొన్నారు. మండలంలోని బొదులూరు ఆరోగ్య కేంద్రాన్ని, ఎయం కోట సమీపంలోని సంగమ కాలువపై నిర్మించిన రెండు వంతెనలు, జిపిఎస్ ప్రాథమిక పాఠశాలను, మినీ అంగన్వాడి కేంద్రాన్ని, గుడిసె పర్యటన ప్రాంతానికి సంబంధించిన చెక్ పోస్టును బుధవారం జిల్లా కలెక్టర్, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ, వివిధ శాఖల అధికారులతో కలిసి సందర్శించారు. బొదులూరు ఆరోగ్య కేంద్రంలో అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ప్రధానమంత్రి జన్‌మన్ పథకం ద్వారా పివిటిజిల గృహ నిర్మాణం గురించి అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికి కులాయి పథకం నిర్వహణకు గ్రామాలలో కమిటీలు ఏర్పాటు చేసుకొని, వాటి ద్వారా వచ్చే రుసుము కుళాయిల నిర్వహణకు ఉపయోగించుకోవాలని సూచించారు. ఐటీడీఏ, అటవీ శాఖ అధికారులు, పుల్లంగి పంచాయితీ ప్రజలు పంచాయితీ తీర్మానాలతో పర్యాటక ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గుడిసె పర్యటక ప్రాంతానికి వచ్చే పర్యటకులు సాయంకాలం ఆరు గంటల లోపు తిరిగి వచ్చే విధంగా అవగాహన కల్పించాలని, ఆరు గంటలు దాటిన తర్వాత వచ్చిన పర్యాటకులకు జరిమానా విధించాలని ఆదేశించారు. పర్యటకులు వాటర్ బాటిల్స్, చెత్తాచెదారం ఎక్కడపడితే అక్కడ వేయకుండా చెత్త కుండీలు ఏర్పాటు చేయాలన్నారు. పర్యాటక ప్రాంతంలో మరుగుదొడ్డి ఏర్పాటు చేయాలన్నారు. పుల్లంగి గ్రామంలో కమ్యూనిటీ భవనం ఏర్పాటు చేయాలని పుల్లంగి సర్పంచ్ వి.జార్జి బాబు, పి.ప్రేమ్ కుమార్ రెడ్డి కలెక్టర్‌కు విన్నవించారు. వై.రామవరం మండలంలోని పివిటిజిలకు సంబంధించిన గహాలు సకాలంలో పూర్తి చేయాలని,గ్రామాలకు రహదారులు ఏర్పాటు చేయాలని ఎంపీపీ కె.ఆనంద్, జడ్పిటిసి సుబ్బలక్ష్మి కలెక్టర్ వారికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఐ.శ్రీనివాసరావు, తహశీల్దార్లు బాలాజీ, వేణు, ఎంపీడీవో విశ్వనాథ్, డిప్యూటీ ఇంజనీర్లు సాయి సతీష్, ఉమా శంకర్, ఎంపీపీ యస్.లలిత, ఏఈలు సత్యనారాయణ, ప్రదీప్, ఫారెస్ట్ రేంజ్ అధికారులు అనూష, ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఫీడర్ అంబులెన్స్‌ను నడుపుతున్న కలెక్టర్

కాఫీ ఉపకరణాల మంజూరుకు చర్యలు

-ఐటిడిఎ పిఒ అభిషేక్

మాట్లాడుతున్న పిఒ అభిషేక్

ప్రజాశక్తి -పాడేరు: స్వయం సహాయక సంఘాల లో సభ్యులుగా ఉన్న గిరిజన కాఫీ రైతులకు ప్రధాన మంత్రి ఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్ప్రైజెస్ పథకం (పి. ఎం.ఎఫ్.ఎం.ఇ) లో భాగంగా కాఫీ ఉప కరణాలు మంజూరు చేయడానికి తగిన చర్యలు చేపట్టాలని ఐటిడిఏ పి.ఓ. వి.అభిషేక్ పేర్కొన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో కాఫీ బోర్డు అధికారులు, ఐటిడిఏ కాఫీ విభాగం, డి.ఆర్.డి. ఏ, బ్యాంకు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన కాఫీ రైతులకు కాఫీ ప్రాసెసింగ్కు అవసరమైన కల్లాలు, బేబీ పల్పర్లు, అల్యూమినియం నిచ్చెనలు, టార్పాలిన్లు ఒక్క యూనిట్ కింద 35 శాతం రాయితీపై లబ్ధిదారులకు అందిస్తామన్నారు. కల్లం రూ.55 వేలు (50 శాతం కాఫీ బోర్డు సబ్సిడీ), బేబీ పల్పలర్లు రూ.42 వేలు (50 శాతం కాఫీ బోర్డు సబ్సిడీ), అల్యూమినియం నిచ్చెన రూ.15 వేలు, టార్పాలిన్ రూ. 5 వేలు రాయితీపై అందిస్తామని చెప్పారు. ఈ పథకానికి మొత్తం .1 లక్ష 17 వేలు వ్యయం అవుతోందన్నారు. రాయితీ పోను మిగిలిన మొత్తాన్ని బ్యాంకుల నుండి రుణం అందిస్తారని చెప్పారు. లబ్ధిదారులకు రుణాలు అందించడానికి బ్యాంకులు సహకారం అందించాలని కోరారు.ఈ సమావేశంలో ఐటిడి ఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వేంకటేశ్వరరావు, కాఫీ బోర్డు డి.డి. ఎస్.రమేష్, కాఫీ సహాయక సంచాలకులు ఎన్.అశోక్, డి.ఆర్.డి.ఏ పి.డి. వి.మురళి, యూనియన్ బ్యాంకు మేనేజర్ ఎల్. భాను చందర్, ఫీల్డు అధికారి ఎస్.రఘు కుమార్ పాల్గొన్నారు.

పెట్టుబడి సహాయం అందిస్తాం

హుకుంపేట: వన్ దన్ వికాస కేంద్రాల ఉత్పత్తులకు పెట్టుబడి సహాయం అందిస్తామని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్ అన్నారు. బుధవారం హుకుంపేట మండలం భీమవరం వన్ దన్ వికాస్ కేంద్రాన్ని ఆయన సందర్శించారు. వి డి వి కే కేంద్రంలో ఉత్పత్తి చేస్తున్న చీపుర్ల తయారీని పరిశీలించారు. స్పెన్సర్స్, బిగ్ బజార్ వంటి పెద్ద మాల్స్ లో చీపుర్లను విక్రయించే విధంగా నాణ్యమైన చీపురులను తయారు చేయాలని నిర్వాహకులకు సూచించారు. నాణ్యమైన చీపుర్లను తయారుచేసి అధిక ధరలకు విక్రయించి తగిన లాభాలను పొందాలని పేర్కొన్నారు. విడివికే లకు అవసరమైన పనిముట్లను సమకూరుస్తామని చెప్పారు. హాత్ బజార్లలో గిరిజన ఉత్పత్తులు విక్రయించడానికి ఏర్పాటు చేస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి వి.మురళి, ఏరియా కోఆర్డినేటర్ రత్నకుమారి, ఏపీఎం అప్పయమ్మ పాల్గొన్నారు.

మన్యం కాఫీకి మరింత గుర్తింపు తీసుకొస్తాం

-జిసిసి డిఎం దేవరాజు

ప్రజాశక్తి-చింతపల్లి: గిరిజన సహకార సంస్థ తరపున కాఫీ కొనుగోలులో ఎంచుకున్న లక్ష్యాన్ని పూర్తి చేసేందుకు కృషి చేస్తున్నామని ఆ సంస్థ డివిజనల్ మేనేజర్ దేవరాజు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ, మన్యం కాఫీకి అంతర్జాతీయంగా మరింత గుర్తింపు తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, అందుకు తగినట్లుగానే తమ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ దృష్టి సారించారన్నారు. కాఫీ రైతులను ప్రోత్సహిం చేందుకు కాఫీ పార్చిమెంట్‌ను కిలో 285 రూపాయలకు, కాఫీ చెర్రీ కిలో 150 రూపాయలకు, రొబస్టా 80 రూపాయలకు కొనుగోలు చేసేందుకు గత ఏడాది కంటే ఈ ఏడాది ప్రతి దానిపై కిలోకు ఐదు రూపాయల చొప్పున పెంచడం జరిగిందన్నారు. 650 టన్నుల కాఫీని కొనుగోలు చేయడం లక్ష్యంగా ఎంచుకు న్నామన్నారు. చింతపల్లి మండలంలో 300 టన్నులు, జీకే వీధి మండలంలో 3 టన్నులు, కొయ్యూరు మండలంలో 50 టన్నులు లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఈ కొనుగోలుకు చింతపల్లిలో 12 బృందాలు, జీకే వీధిలో 14, కొయ్యూరులో రెండు బృందాలను నియమించడం జరిగిందన్నారు.

కూలీలకు రగ్గుల పంపిణీ

ప్రజాశక్తి-చింతపల్లి : మన్య ప్రాంతంలో జాతీయ రహదారి విస్తరణ నిర్మాణ పనులకు మధ్యప్రదేశ్ నుండి వచ్చిన కూలీలను రగ్గులను రెవెన్యూ ఉద్యోగి దుమంతి సత్యనారాయణ బుధవారం పంపిణీ చేశారు. చింతపల్లి మండల కేంద్రానికి కూత వేటు దూరంలోని చిన్నగెడ్డ గ్రామం వద్ద గుడారాలు వేసుకొని నివాసం ఉంటున్న సుమారు 30 కుటుంబాలకు రగ్గులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సుధీర్, భవానీ, ఓంకార్ పాల్గొన్నారు.

రగ్గులు పంపిణీ చేస్తున్న రెవెన్యూ ఉద్యోగి

రికార్డులు పరిశీలిస్తున్న జెసి అభిషేక్ గౌడ్

ఆరోగ్య శ్రీ కార్డులు పొందేలా చర్యలు

-జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్

ప్రజాశక్తి-చింతపల్లి: స్థానిక ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని,అల్లూరి జిల్లాలో 60 శాతం మంది గిరిజనులకు ఆరోగ్యశ్రీ కార్డులు లేవని, అందరు కార్డులు పొందేలా చర్యలు తీసుకుంటామని పాడేరు జాయింట్ కలెక్టర్ అభిషేక్ గౌడ్ తెలిపారు. బుధవారం చింతపల్లి ప్రాంతీయ ఆసుపత్రిని ఆయన సందర్శించారు. ఆసుపత్రిలో గత కొన్ని నెలలుగా జరుగుతున్న పరిణామాలపై ఆసుపత్రి సిబ్బందిని విచారించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉందని, త్వరలో భర్తీ చేస్తామన్నారు. అధిక శాతం గిరిజనులకు ఆరోగ్యశ్రీ కార్డులు లేవని, దీనిపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అందరికీ ఆరోగ్యశ్రీ కార్డులు పొందేలా చర్యలు తీసుకుంటామన్నారు. గత కొన్ని నెలలుగా ఆసుపత్రిలో జరుగుతున్న పలు విషయాలపై ఫిర్యాదులు వచ్చాయని, సిబ్బందితో మాట్లాడి విచారణ నిర్వహించామన్నారు. నివేదికను జిల్లా కలెక్టరుకు అందజేస్తానన్నారు.

ప్లాస్టిక్‌పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి - చింతపల్లి : ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని స్థానిక సర్పంచ్ దురియా పుష్పలత, ఎంపీడీవో శ్రీనివాసరావు కోరారు. ప్లాస్టిక్ ను నిషేధిద్దాం... పర్యావరణాన్ని కాపాడుదాం అనే నినాదంతో బుధవారం చింతపల్లి వారపు సంతలో సర్పంచ్, ఎంపీడీవోల ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాల మేరకు డిసెంబర్ 1 నుండి ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధిస్తున్నామన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని వ్యాపారులు, వినియోగదారులు పూర్తిగా నిషేధించాలని, లేని పక్షంలో రూ.500 నుంచి 1000 వరకు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ అంబేద్కర్, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ చేపడుతున్న సర్పంచ్, అధికారులు

నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -అనంతగిరి: మరమ్మతుకు గురైన విద్యుత్ స్తంభాలు తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయాలని స్థానిక సిపిఎం జెడ్పిటిసి దీసరి గంగరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆ గ్రామంలో సందర్శించిన ఆయన గ్రామస్తులతో సమస్యలను అడిగి తెలుసుకున్నారు.విద్యుత్ స్తంభాలు రంధ్రాలు ఏర్పడి ప్రమాద భరితంగా ఉన్నాయని గ్రామస్తులు తెలిపారన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎగువశోభ గ్రామంలో 10 విద్యుత్ స్తంభాలు తుప్పు పట్టి రంధ్రాలు ఏర్పడ్డాయన్నారు. తుఫాన్ ప్రభావంతో ఎప్పుడు కూలి పోతాయోనని గ్రామస్తులు బిక్కుబిక్కుమంటూ భయాందోళనతో ఉన్నారన్నారు.ఈ విషయమై ఎఇ దృష్టికి వెళ్లడం జరిగిందని ఆయన అన్నారు.

అన్నవరం వంతెన నిర్మించేదెప్పుడు?

- ★ 2022లో భారీ వరదలకు కూలిపోయిన బ్రిడ్జి
- ★ నాటి నుండి పట్టించుకోని పాలకులు,
- ★ నిలిచిపోయిన ఆర్టీసీ బస్సు సర్వీసులు
- ★ ప్రతి ఏటా వర్షాలకు ఇరువైపులా కొట్టుకుపోతున్న తాత్కాలిక బ్రిడ్జి
- ★ వరదల సమయంలో 40 గ్రామాలకు రాకపోకలు బంద్
- ★ సిపిఎం ఆధ్వర్యాన అనేక సార్లు ఆందోళన చేసినా స్పందించని వైనం

కుప్పకూలిపోయిన ఉన్న అన్నవరం వాగుపై బ్రిడ్జి , పక్కనే తూరలతో నిర్మించిన తాత్కాలిక వంతెన, కోతకు గురైన తాత్కాలిక బ్రిడ్జి

ప్రజాశక్తి-విఆర్.పురం

ప్రభుత్వాలు మారుతున్నా గిరిజనుల కష్టాలు మాత్రం తీరడం లేదు. 2022లో వరదలకు మండలంలోని అన్నవరం -ఉమ్మడివరం మధ్య వాగుపై ఉన్న వంతెన కూలిపోగా, నేటికీ కొత్త బ్రిడ్జి నిర్మాణం చేయలేదు. దీంతో సుమారు 40 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మండలంలోని అన్నవరం-ఉమ్మడివరం మధ్య వాగుపై నిర్మించిన వంతెన 2022 జులైలో సంభవించిన భారీ వరదలకు కుప్పకూలిపోయింది. దీంతో నాటి ప్రభుత్వం గెడ్డపై తూరలు వేసి తాత్కాలిక వంతెన నిర్మాణం చేసింది. అయితే బ్రిడ్జికి ఇరువైపులా కాంక్రీట్ సైడ్ వాల్స్ ఏర్పాటు చేయకుండా మట్టి నింపడంతో 2023, 2024 సంవత్సరాల్లో వచ్చిన వరదలకు రెండు సార్లు ఈ తాత్కాలిక వంతెన ఇరువైపులా కొట్టుకుపోయింది. మళ్లీ తాత్కాలిక మరమ్మతులు చేసి అధికారులు చేతులు దులుపుకున్నారు తప్ప పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపట్టలేదు. తాత్కాలిక వంతెన రెండు వైపులా దెబ్బతినడంతో దీని పై నుండి ఆటోలు, ద్విచక్ర వాహనాలు తప్పా ట్రాక్టర్లు, ఇతర బరువు వాహనాల రాకపోకలకు అనుమతి లేదు. దీంతో ఈ వాగుకు అవతల ఉన్న సుమారు 40 గ్రామాలకు వరదలు సమయంలో రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఆ సమయంలో నిత్యావసరాలు తెచ్చుకోవడానికి, అనారోగ్యానికి గురైతే ఆసుపత్రికి వెళ్లడానికి వీలులేని పరిస్థితి నెలకొంది. అంబులెన్స్ కూడా ఈ బ్రిడ్జిపై నుండి రాలేని స్థితి ఉంది. 2022లో బ్రిడ్జి కూలిపోయిన నాటి నుండి ఈ మార్గంలో ఆర్టీసీ బస్సు సర్వీసులు నిలుపుదల చేశారు. దీంతో చదువుల కోసం వెళ్లాల్సిన విద్యార్థులు, అనారోగ్యం కారణంగా రాజమండ్రి హాస్పిటల్‌కి వెళ్లాల్సిన ప్రజలు, ప్రయాణికులు నానా అవస్థలు పడుతున్నారు. బరువు వాహనాలు వెళ్లలేని పరిస్థితుల్లో వ్యవసాయానికి అవసరమైన విత్తనాలు, ఎరువుల బస్తాలు మండల కేంద్రం నుండి తమ గ్రామాలకు తెచ్చుకోవాలన్నా, రైతులు పండించిన వరి ధాన్యం, మిర్చి లాంటి పంటలను మండల కేంద్రానికి తరలించి అమ్ముకోవాలన్నా తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

40 గ్రామాల ప్రజలకు ప్రధానమైన మార్గమైన ఈ వాగుపై పూర్తిస్థాయి వంతెన నిర్మాణం చేయకుండా ప్రభుత్వాలు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కనీసం తాత్కాలిక బ్రిడ్జికి ఇరువైపు బలమైన కాంక్రీట్ ఫోల్స్ వేసి మరమ్మతులు చేసినా కొద్ది మేరకు బరువు వాహనాలు రాకపోకలకు ఆస్కారం ఉండేది. ఆ దిశగా కూడా ఆలోచన చేయడం లేదని బాధిత గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్నవరం వాగుపై పూర్ధిస్థాయి బ్రిడ్జి నిర్మాణం చేయాలని, అంత వరకు తాత్కాలిక బ్రిడ్జికి మరమ్మతులు చేయాలని సిపిఎం ఆధ్వర్యాన స్థానికులు అనేక సార్లు జిల్లా, ఐటిడిఎ అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకపోయింది. చివరికి ఈ నెల 19న బ్రిడ్జి వరకు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. ఇప్పటికైనా టిడిపి కూటమి ప్రభుత్వం, ఎమ్మెల్యే, ప్రభుత్వ అధికారులు స్పందించి గిరిజనుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని తక్షణమే తాత్కాలిక బ్రిడ్జికి మరమ్మతులు చేసి, బస్సులు నడపాలని, పూర్తిస్థాయి వంతెన మంజూరు చేసి నిర్మించాలని బాధిత గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ఎరువులు, విత్తనాలు తెచ్చుకోలేని పరిస్థితి

వ్యవసాయ పరికరాలు, ఎరువులు, విత్తనాలు మండల కేంద్రం నుండి తెచ్చుకోలేని పరిస్థితి నెలకొంది. వాహనాలపై తెచ్చుకోవాలన్నా బ్రిడ్జి ఎప్పుడు కూలిపోతుందోనని ఎవరూ రావడానికి సాహసించడం లేదు. కావునా వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

- కారం నవీన్, ఉలుమూరు గ్రామం

తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం

మండల కేంద్రం నుండి పిల్లలకు పోషకాహారం తెచ్చుకోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. మండల కేంద్రానికి చింతూరు మీదుగా చుట్టూ తిరిగి రావడం వల్ల ఆసల్యమవుతోంది. దీని వల్ల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం హైలెవల్ వంతెన నిర్మించాలి.

- మిడియం సీతమ్మ, అన్నవరం గ్రామం

వాగు ఉధృతి పెరిగితే రాకపోకలు ఆగిపోతున్నాయి

వర్షాలు వస్తే వాగు ఉధృతంగా ప్రవహించే సమయంలో మా గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోతున్నాయి. అయినా అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం తక్షణమే అన్నవరం వాగుపై వంతెన నిర్మించి ఇక్కడి ప్రజలు, రైతులు ఇబ్బందులు తీర్చాలి.

- ఎం.రెడ్డి, రైతు, అన్నవరం గ్రామం

హైలెవల్ బ్రిడ్జి నిర్మాణం చేయాలి

అన్నవరం వాగుపై వంతెన కూలిపోయి మూడేళ్లయినా నేటికీ బ్రిడ్జి నిర్మాణం చేయలేదు. ప్రతి ఏటా వచ్చే వరదలకు ఉన్న తాత్కాలిక డైవర్షన్ బ్రిడ్జి ఇరువైపులా కొట్టుకుపోతుంది. దీనిపై అనేకసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదు. 40 గ్రామాలకు రవాణా సమస్య ఏర్పడింది. ఇప్పటికైనా ప్రభుత్వం దృష్టి సారించి హైలెవల్ వంతెన నిర్మించి ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించాలి.

- సోయం చిన్నబాబు, సిపిఎం మండల నాయకులు

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ప్రజాశక్తి-రంపచోడవరం : విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ రంపచోడవరం డివిజన్ ఆధ్వర్యంలో ఈ నెల 28న అడ్డతీగల విద్యుత్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఇపిడిసిఎల్ రంపచోడవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ టి.గాబ్రియేల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారుల ఈ అవకాశాన్ని వినియోగించుకుని తమ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. ఈ సమావేశానికి సిజిఆర్ఎఫ్ చైర్‌పర్సన్ డాక్టర్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు ఎస్. మసిలమణి, ఆర్థిక సభ్యులు షేక్ బాబర్ హాజరవుతారని పేర్కొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అప్పలనర్స, నాయకులు

సిపిఎం జిల్లా మహాసభలను జయప్రదం చేయండి
- పార్టీ జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ప్రజాశక్తి - పాడేరు: అల్లూరి జిల్లా కేంద్రం పాడేరు లో డిసెంబరు 4, 5 తేదీల్లో జరిగే సిపిఎం జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స పిలుపు నిచ్చారు. పాడేరు లో జిల్లా పార్టీ కార్యాలయంలో మండల పార్టీ కమిటీ కార్యదర్శి ఎల్.సుందరరావు, సీనియర్ నాయకుడు పి.లక్కు, జి.మాడుగుల మండల కార్యదర్శి ఎస్.ధర్మన్న పడలతో కలిసి పి.అప్పలనరస బహిరంగ సభ పోస్టర్‌ను విడుదల చేసారు. అనంతరం పార్టీ జిల్లా కార్యదర్శి పి.అప్పలనరస మాట్లాడుతూ, జిల్లా మహాసభలో గత మూడేళ్లుగా నిర్వహించిన ప్రజా ఉద్యమాలు, అనుభవాలపై సమీక్ష చేసి, భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పి.వి.టి.జి తెగల కు ఇల్లు నిర్మాణానికి 5 లక్షలకు పెంచాలని, ఆదివాసీ మాతృ భాష విద్యా వాలంటీర్లను రెగ్యులర్ చేయాలన్నారు. ఈ సమస్యలపై తీర్మానం చేసి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ కు ప్రణాళిక రూపొందించుకుంటామన్నారు. డిసెంబరు 4 న పాడేరు లో ర్యాలీ, బహిరంగ సభ నిర్వహిస్తామని ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాస రావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు కె.లోకనాథం పాల్గొంటారని తెలిపారు. ఈ బహిరంగ సభకు ప్రజలు తరలిరావాలని కోరారు. తలార్ సింగ్ నుండి పాత బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి సభ నిర్వహిమని పేర్కొన్నారు.

గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -హుకుంపేట: గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఇంటికి నీటి కుళాయి ద్వారా స్వచ్ఛమైన నీరు, అందించడానికి నీరు, పారిశుద్య కమిటీలు ముఖ్య భూమిక పోషిస్తాయనిజల జీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్ పుల్లయ్య సూచించారు. మండల ప్రజా పరిషత్ సమావేశపు మందిరంలో బుధవారం ఎంపిపి కూడా రాజబాబు అధ్యక్షతన డిఈ గోపాలకృష్ణ ఆధ్వర్యంలో జలజీవన్ మిషన్ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పుల్లయ్య మాట్లాడుతూ, ప్రతిరోజు నీరందించే విషయంలో విడబ్ల్యూసి కమిటీలు ముఖ్య భూమిక పోషిస్తాయని తెలిపారు. ఈ కమిటీలో 10 నుండి 15 మంది సభ్యులు ఉండాలని, వీటిలో 25 శాతం మంది వార్డ్ మెంబర్లు, 25 శాతం మంది ఎస్సీ ఎస్టీ, 50శాతం మంది మహిళలు ఉండాలని సూచించారు. వీటి కాలపరిమితి రెండు నుండి సంవత్సరాల వరకు ఉంటుందని, కమిటీకి చైర్మన్ గా సర్పంచ్, కార్యదర్శి వ్యవహరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఈ గోపాలకృష్ణ, ఏఈ జగదీష్, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

శిక్షణ ఇస్తున్న అధికారులు

'ఉపాధి' కూలీల పిల్లలకు నైపుణ్య శిక్షణ

-ఐటిడిఏ పిఒ అభిషేక్

మాట్లాడుతున్న ఐటిడిఏ పిఒ అభిషేక్

ప్రజాశక్తి -పాడేరు: ఉపాధి హామీ పథకంలో వంద రోజులు పని పూర్తి చేసిన కూలీల నిరుద్యోగులైన పిల్లలకు సీడాప్ అందిస్తున్న శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఐటిడిఏ పి.ఓ. వి.అభిషేక్ పేర్కొన్నారు. బుధవారం ఆయన కార్యాలయంలో సీడాప్ డిడియు జి.కె. వై ఉన్నత్ పోగ్రాం గోడ పత్రికను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ఉపాధి హామీ కూలీల పిల్లలకు వివిధ నైపుణ్య రంగాలలో శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. శిక్షణకు ఎంపికైన అభ్యర్థులకు ఉచిత భోజన వసతితో కూడిన శిక్షణను అందిస్తారని చెప్పారు.అభ్యర్థులు 18 నుండి 35 ఏళ్ల వయస్సు కలిగి పదవ తరగతి ఆపై చదువులు చదివి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి ఎం.వెంకటేశ్వరరావు, డి.ఆర్.డి. ఏ పి.డి వి.మురళి , సీడాప్ జె.డి. ఎం.ఎ.కల్యాణి జగదీశ్వర పాల్గొన్నారు.

బాల్య వివాహాలను వ్యతిరేకించాలి

బాల్య వివాహాలను అందరూ వ్యతిరేకించాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి వి. అభిషేక్ సూచించారు. బాల్య వివాహాలు సామాజిక దురాచారమని పేర్కొన్నారు. బుధవారం స్థానిక కె.జి.బి.వి. పాఠశాలలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాల్య వివాహాల అవగాహనా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. బాలికలను కాపాడానికి అనేక చట్టాలను ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయన్నారు. బాలికా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని చెప్పారు. గిరిజన సమాజం ఎదగాలంటే బాలికలు ఉన్నతంగా చదువుకుని తల్లిదండ్రులకు ఆసరాగా నిలవాలన్నారు. బాల్య వివాహాలపై అధికారులకు, పోలీసులకు సమాచారం అందించాలని పేర్కొన్నారు. ఐసిడిఎస్ పిడి సూర్యలక్ష్మి మాట్లాడుతూ, బాల్య వివాహాలు బాలికల విద్య, రక్షణ, ఆరోగ్యం అభివృద్ధికి ఆటంకం కలిగిస్తున్నాయని. లక్ష్యాలను నిర్దేశించుకుని బాగా చదువుకోవాలన్నారు.

డిఎస్పీ బి.వేణు గోపాల్ మాట్లాడుతూ, శారీరకంగా, మానసికంగా ఎదుగుదల వచ్చాక వివాహాలు చేసుకోవాలని సూచించారు. ప్రేమ పేరుతో ఎవరైనా ఇబ్బందులు పెడితే 1098 నెంబరుకు ఫోను చేసి చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఇ ఓ బ్రహ్మాజీరావు, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ బాషా, సిడిపిఓ ఝాన్సీ లక్ష్మి, అడ్వకేట్ టి. ప్రసాద నాయుడు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ: బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని సీడీపీవో నీలిమ అన్నారు. మండలంలోని కిల్లోగుడ ప్రభుత్వ ఆంగ్ల మాధ్యమ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో బాల్య వివాహాలకు విముక్త కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు మానవహారాన్ని చేపట్టి ప్రతిజ్ఞ చేశారు.బాల్య వివాహాలతో ఆరోగ్య సమస్యలు తలెత్తు తున్నాయన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు పద్మ పాల్గొన్నారు.

పొలం పిలుస్తోందిలో పాల్గొన్న అధికారులు, రైతులు

ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలోని గాసర పల్లి బాకూరులో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించామని వ్యవసాయ శాఖ ఏవో లీలావతి తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, తుపాను నేపథ్యంలో వరి కోతలు ఆపేసి, పండించిన పంటను టార్పాలిన్‌లతో కప్పాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓ ప్రియాంక, వీహెచ్ఏ శాంతికుమారి రైతులు తదితరులు పాల్గొన్నారు.

దుంబ్రిగుడ:- సేంద్రియ పద్ధతిలో వ్యవసాయం సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయని మండల వ్యవసాయ శాఖ అధికారిని నీలవేణి చెప్పారు. మండలంలోని సొవ్వా పంచాయతీ దేముడువలసలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కూరగాయల సాగు, వరి పంటల కోతలో మెలకువలపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు. దేశీయ నూతన పంటల సాగుతో మార్కెట్లో గిరాకీ ఉందన్నారు. బ్రకోలీ, క్యాబేజీ, క్యాప్సికమ్ పంటలపై దృష్టి సారించి అంతర పంటలుగా చేస్తే ఆదాయాన్ని పెంపొందించు కోవచ్చన్నారు. సేంద్రియ ఎరువుల సాగుతో అధిక దిగుబడులు సాధించి ఆర్థిక పురోగతిని సాధించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఉద్యానవన శాఖ అధికారిణి శిరీష, సిబ్బంది రాములమ్మ, తదితరులు పాల్గొన్నారు.

7న టీచర్స్, పేరెంట్స్ సమావేశం

ప్రజాశక్తి-పెదబయలు: స్థానిక బాలుర రెసిడెన్సీ యల్ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు డిసెంబర్ 7న టీచర్స్, పేరెంట్స్ సమావేశం నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సూర్యశంకర్‌రావు తెలిపారు. ఈ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రులు, పేరెంట్స్, విద్యా కమిటి అధికార ప్రజాప్రతినిధులు హాజరై పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

గంజాయి సాగు చేపడితే చర్యలు

ప్రజాశక్తి-చింతపల్లి: గంజాయి సాగు, అక్రమ రవాణా, పరిమితికి మించిన వేగం, లైసెన్సులు లేకుండా వాహనాలు నడపడం తదితర వాటిపై స్థానిక సీఐ వినోద్ బాబు, ఎస్సై రమణ లు చింతపల్లి వారపు సంతలో బుధవారం అవగాహన కల్పించారు. పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడపడంతో జరిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు.ఈ కార్య క్రమాలలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు

ప్రజాశక్తి-అరకు లోయ : అరకులోయ ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ఎయిడ్స్ డే సందర్భంగా కళాశాలలో రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ పి.చలపతి మాట్లాడుతూ, ఎయిడ్స్ నిర్మూలనకు గ్రామాలలో యువతకు అవగాహన కల్పించాలని కోరారు.ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. భరత్ కుమార్ నాయక్ మాట్లాడుతూ, పెయింటింగ్ పోటీలు విద్యార్థినులలో దాగివున్న నైపుణ్యం వెలికి తీయడంలో దోహదపడతాయని తెలిపారు.ఈ పోటీలలో అధ్యాపకులు కే.బాలరాజు, సిహెచ్ మురళికృష్ణ, ధర్మారావు, సుభన్, స్వర్ణలత పాల్గొన్నారు.

పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

కల్వర్టును పూర్తి స్థాయిలో నిర్మించాలి : సిపిఎం

కల్వర్టును పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: రాళ్ల పుట్టు కల్వర్టును పూర్తి స్థాయిలో నిర్మించాలని సిపిఎం మండల కార్యదర్శి కొర్ర త్రినాథ్ డిమాండ్ చేశారు. బుధవారం ఏనుగు రాయి పంచాయతీ పర్యటనలో భాగంగా రాళ్ల పుట్టు కల్వర్టుని సిపిఎం మండల కార్యదర్శి కొర్ర త్రినాథ్, పార్టీ సభ్యులతో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ఇరవై ఏళ్లుగా సిపిఎం ఆధ్వర్యంలో రాళ్ల పుట్టు గ్రామం సమీపంలో కల్వర్టు నిర్మాణం చేపట్టాలని ఆందోళనల ఫలితంగా ప్రభుత్వం స్పందించి రెండేళ్ల క్రితం 80 లక్షలు మంజూరు చేసి రాళ్ల పుట్టు గ్రామంలో కల్వర్టు నిర్మించేందుకు నిధులను కేటాయించిందని తెలిపారు.కల్వర్టు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలను పాటించ లేదని, ఇరువైపులా రక్షణ గోడలు నిర్మాణం చేయలేదని తెలిపారు.రాళ్ల పుట్టులో కల్వర్టు నిర్మాణం చేపట్టడంతో సుమారు 20 గ్రామాల ఆదివాసి గిరిజనులకు రహదారి సౌకర్యం కలుగుతుందన్నారు. కల్వర్టు నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు.లేదంటే ఐటీడీఏ ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. సిపిఎం సీనియర్ నాయకులు ఎస్.గాసిరందొర, పి రామదాసు, కె.బాలరాజు, ఎం.సురేష్, ఎం చిన్నయ్య పడాల్, రవి పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించాలి

ప్రజాశక్తి-హుకుంపేట: స్థానిక ఐసిడిఎస్ కార్యాలయంలో కిషోర్ వికాసం పై ఉద్యోగులకు శిక్షణ బుధవారం నిర్వహించారు. సిడిపిఓ దేవి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ సూర్యలక్ష్మి మాట్లాడుతూ, బాల కార్మిక వ్యవస్థను నిర్మూలన చేయాలన్నారు. బాల్య వివాహాలు, సైబర్ నేరాలు, బ్యాంక్ హ్యాకింగ్, పోస్కో ఆక్ట్‌పై కిషోర్ బాలికలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమానికి ఈవో పి.ఆర్.డీ. అప్పలరాజు, ఎంఆర్పిలు, సెర్ప్ సీసీలు, హెచ్.వి.లు, జూనియర్ కాలేజీ లెక్చరర్స్, వెల్ఫేర్ అసిస్టెంట్స్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పీడీ సూర్యలక్ష్మి

3న సిపిఎం మండల మహాసభ

మాట్లాడుతున్న సిపిఎం నేత సీసం సురేష్

ప్రజాశక్తి-చింతూరు : భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) చింతూరు మండల 9వ మహాసభ డిసెంబర్ 3న మండలంలోని కల్లేరు గ్రామంలో నిర్వహిస్తున్నట్లు సిపిఎం మండల కార్యదర్శి సీసం సురేష్ తెలిపారు. సిపిఎం చింతూరు కార్యాలయంలో బుధవారం జరిగిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో సురేష్ మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంత పేద ప్రజల పక్షపాతి సిపిఎం మహాసభలో గత మూడేళ్ల పార్టీ చేసిన కృషి సమీక్షించి భవిష్యత్తు కర్తవ్యాలను రూపొందించుకోవడం జరుగుతుందని చెప్పారు. పోలవరం నిర్వాసితులు, ఆదివాసీలు, రైతులు, వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ కూలీలు సమస్యల పరిష్కారానికి సిపిఎం అనేక ఉద్యమాలు చేసిందని గుర్తు చేశారు. అలాగే గ్రామీణ ప్రాంతాల విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలని కోరుతూ మూడేళ్ల కాలంగా పోరాడినట్లు చెప్పారు. మహాసభకు మండల వ్యాప్తంగా ఉన్న పార్టీ సభ్యులు ఎన్నుకున్న ప్రతినిధులు హాజరవుతారని, ముఖ్య అతిథులుగా పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.వెంకటేశ్వర్లు, పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు పొడియం లక్ష్మణ్, కారం సుబ్బారావు, కలుముల మల్లేష్, కలుముల రామారావు, మడివి రాజేష్, చైతన్య పాల్గొన్నారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా ప్రచారం

చిన్నారులకు ఆటాపాట ద్వారా నేర్పుతున్న అంగన్వాడీ టీచర్

ప్రజాశక్తి-సీలేరు : జీకే వీధి మండలం సీలేరు, దారకొండ, దుప్పిలివాడ పంచాయతీల పరిధిలోని చింతపల్లి క్యాంప్, దారకొండ, వలసగెడ్డ, వలసగెడ్డ కొత్తూరు తదితర గ్రామాల్లో లింగ వివక్షకు వ్యతిరేకంగా మంగళ, బుధవారాల్లో ఆయా సచివాయాల సిబ్బంది విస్తృతంగా ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో గ్రామస్తులతో సమావేశమై ఆడ మగ అనే తారతమ్యం ఉండకూడదని గిరిజనులకు సూచించారు. సైబర్ క్రైమ్ నేరాలు, ఆన్‌లైన్ మోసాలు వల్ల కలిగే అనర్థాల గురించి తెలియజేశారు. అపరిచిత వ్యక్తులకు దూరంగా ఉండాలని, అటువంటి వ్యక్తులు ఎవరైనా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. మహిళ గర్భం దాల్చిన తర్వాత స్కానింగ్ ద్వారా తెలుసుకొని మగ పిల్లాడు అయితే ఉంచుకొని ఆడపిల్ల అయితే అబార్షన్ చేయించడం తరచూ జరుగుతున్నాయని, అలా చేయడం నేరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ మహిళా పోలీసులు రేవతి, తగ్గి ఈశ్వరి, ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్ ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల అనర్థాలపై అవగాహన

చింతూరులో అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-చింతూరు : 'బాల్య వివాహ ముక్త్ భారత్ జాతీయ ప్రచార కార్యక్రమాన్ని న్యూఢిల్లీ విజ్ఞాన్ భవన్‌లో బుధవారం ప్రారంభించిన సందర్భంగా చింతూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జన కళ్యాణ్ వెల్ఫేర్ సంస్థ, మహిళా శిశు సంక్షేమ శాఖ, ఐసీడీఎస్ ఆధ్వర్యాన బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం అధికారులు, మహిళలు, విద్యార్థినులు ప్రతిజ్ఞ చేశారు. తహశీల్దారు చిరంజీవి, ఎంపిడిఒ చైతన్య, చైల్డ్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ పి.విజయ గౌరీ, చింతూరు ఐటిడిఎ ఏవో రాజకుమార్, జనకళ్యాణ్ వెల్ఫేర్ సొసైటీ డైరెక్టర్ బి.నాగేశ్వరరావు, కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శేఖర్, ఐసీడీఎస్ పర్యవేక్షాధికారులు సంఘమిత్ర ప్రియాంక, ఎస్‌హెచ్‌జి గ్రూప్ సభ్యులు, అంగన్వాడీ కార్యకర్తలు, కిషోర్ బాలికలు పాల్గొన్నారు.

మారేడుమిల్లి : బాల్ వివాహ ముక్త్ భారత్ జాతీయ ప్రచార కార్యక్రమాన్ని స్థానిక బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థినులు, సంబంధిత శాఖ అధికారులతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ తూతిక శ్రీనివాస విశ్వనాధ్ బాల్య వివాహాలకు వ్యతిరేకంగా సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలు ఒక సాంఘిక దురాచారమని, బాల్య వివాహాలు కారణంగా బాలిక విద్య, రక్షణ, ఆరోగ్యం, అభివృద్ధిపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. బాల్య వివాహాలు జరగడానికి చేసే ఏ ప్రయత్నాలను పంచాయతీ, ప్రభుత్వ అధికారుల దృష్టి తీసుకురావాలని సూచించారు. బాల్య వివాహాలపై పోలీసులకు సమాచారం అందించడానికి డయల్ 100, 112 నెంబర్లను వినియోగించాలన్నారు. చైల్డ్ లైన్ హెల్ప్ నెంబర్ 1098కు కాల్ చేయాలని, సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో తహశీల్దారు బాలాజీ, సీడీపీఓ ప్రసన్న విశ్వనాథ్, విస్తరణ అధికారి పివి విజయ కుమార్, ప్రధానోపాధ్యాయులు బివిఎస్ కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

రాజవొమ్మంగిలో అవగాహనా సదస్సు

మారేడుమిల్లిలో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఎంపిడిఒ శ్రీనివాస విశ్వనాధ్

రాజవొమ్మంగి : స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో బాల్య వివాహ ముక్తభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 2030 సంవత్సరంకు బాల్య వివాహరహిత ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన ప్రతిజ్ఞ పిల్లలందరితో చేయించారు. బాల్య వివాహాలు చేసుకోవడం వలన కలిగే అనర్థాలు గురించి పిల్లలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం వార్డెన్ ఉపాధ్యాయులు ఐసిడిఎస్ సిడిపిఓ, సూపర్వైజర్లు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలను చెల్లించాలి

పారిశుధ్య కార్మికుల ర్యాలీ, ధర్నా

ఐటిడిఎ ఎఒకు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నేతలు, కార్మికులు

ప్రజాశక్తి-చింతూరు: చింతూరు డివిజన్ పరిధిలో నాలుగు మండలాల్లో ఉన్న పంచాయతీ పారిశుధ్య కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, పెండింగ్ వేతనాలు చెల్లించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బస్టాండ్ నుండి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ, అక్కడ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సిఐటియు మండల ప్రధాన కార్యదర్శి పొడియం లక్ష్మణ్ మాట్లాడుతూ పంచాయతీ పారిశుధ్య కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని, నాలుగైదు నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను చెల్లించాలని, ఉద్యోగ భద్రత, ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని కోరారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, పని భారం తగ్గించాలని, రాజకీయ వేధింపుల ఆపాలని, సంవత్సరానికి రెండు జతలు యూనిఫారం, గ్లౌజులు, మాస్కులు, బూట్లు ఇవ్వాలని ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.

శానిటేషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించకపోతే ఐటీడీఏ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. అనంతరం ఐటిడిఏ ఏఓకి వినతి పత్రాన్ని అందజేశారు. దీనికి స్పందించిన ఏఓ ఐటీడీఏ పరిధిలో ఉన్న సమస్యలను పరిష్కరిస్తామని, మిగిలిన సమస్యలను పైఅధికారులు దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కమిటీ సభ్యులు కారం సుబ్బారావు, శానిటేషన్ వర్కర్లు సురేష్, గాంధీ, వరలక్ష్మి, రజని, ముత్తమ్మ, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

గోకులం షెడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని రాజేంద్రపాలెం గ్రామంలో ఎన్ఆర్ఇజిఎస్ నిధులతో మినీ గోకులం పథకం కింద జంపా దేవకుమారి పౌల్ట్రీ షెడ్డు నిర్మాణానికి టిడిపి పాడేరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వరి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం రైతులను ఆదుకొనేందుకు ఉపాధి హామీని అనుసంధానం చేస్తూ గోకులం పథకం కింద షెడ్లు నిర్మిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు తోట దొరబాబు, లక్ష్మణ్, బుజ్జిబాబు, సుధీర్, సెగ్గే సాయి భావన, పూర్ర రాజేష్, లోచల రాజారావు, గూడెపు శేషుబాబు, గంట శివాజీ, రాఘవరాజు, బంగారు బాబు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి

వికలాంగ విద్యార్థులకు ఆటల పోటీలు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : డిసెంబర్ 3న అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు స్థానిక మండల ప్రజా పరిషత్ పాఠశాలలో బుధవారం వికలాంగ విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వీణా దేవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వికలాంగ విద్యార్థులకు చదువుతోపాటు ఆటపాటలు ఉంటే వారు మానసికంగా ఆరోగ్యంగా అభివృద్ధి చెందుతారని తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేక ఉపాధ్యాయుడు చిన్నబాబు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వికలాంగ బాలలతో ఆటలాడిస్తున్న హెచ్ఎం

వరి కోతలను వాయిదా వేసుకోవాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం వల్ల రానున్న మూడు రోజులు భారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరిక నేపథ్యంలో రైతులు వరి కోతలను వాయిదా వేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏవో ఉమాదేవి సూచించారు. మండలంలోని బూదరాళ్ల, మర్రివాడ రైతు భరోసా కేంద్రాలలో పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా రైతులతో ఆమె మాట్లాడారు. పంట కోసిన రైతులు ధాన్యం తడవకుండా బరకాలను కప్పుకొని తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో సంబంధిత రైతు సేవా కేంద్రం సిబ్బంది సతీష్, ఎండన్న, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం ఎగరబోస్తున్న గిరిజన రైతులు